ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



**(విశాఖపట్నంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 27-7-97)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

భగవాన్ స్కంధాశ్రమంలో ఉండగా ఒక పండితుడు హృదయ కుహరమధ్యే అనివ్రాసి తరువాత ఏమి వ్రాయాలో తెలియక దానిని భగవాన్ ప్రక్కన పెట్టి ఆయన టౌన్‌లోకి వెళ్ళారు. ఆయన తిరిగివచ్చేసరికి భగవాన్ ఆ శ్లోకాన్ని పూర్తిచేసి అక్కడ పెట్టారు. క్రిందమాత్రం ఆశ్లోకాన్ని మొదలు పెట్టిన పండితుని పేరే పెట్టారు. అదేమిటి స్వామి అని ఆయన అంటే మొదలు పెట్టినది నీవేకదా అన్నారు భగవాన్.

"హృదయ కుహర మధ్యే కేవలం బ్రహ్మమాత్రం
హ్యహమహమితి సాక్షా దాత్మరూపేణ భాతి।
హృదివిశ మనసా స్వం చిన్వతా మజ్జతావా
పవన చలన రోధా దాత్మ నిష్ఠోభవత్వం ॥"

సమస్త మతముల సారము, వేదాంత సారము అంతా ఇందులో ఉంది.

ఈ సృష్టిలో జీవించే ప్రతీ పదార్థానికి కూడా ఒక పూర్వజన్మ ఉంటుంది. దేహము ఏదైనా గత జన్మకు, ఈ జన్మకు కొంత అనుబంధం ఉంటుంది. లోకంలో మనకు అనేక వ్యత్యాసాలు కనిపిస్తూ ఉంటాయి. గత జన్మకు సంబంధించిన వాసనలు మన మనస్సులో ఉంటాయి. మనస్సుయొక్క ప్రభావం మనిషి మీద పని చేస్తూ ఉంటుంది. ఆ ప్రభావాన్ని బట్టి మనిషి జీవిస్తూ ఉంటాడు. రంగులు వేరైనా, మతాలు వేరైనా, స్త్రీ అయినా, పురుషుడు అయినా పండితుడు అయినా పామరుడు అయినా ప్రతి జీవిలోను కూడ అందరి హృదయాలలో ఒక సద్వస్తువు ఉంది. అది తనంతట తానుగా ప్రకాశిస్తోంది. దానికి మరణం లేదు. మీకు తెలిసినా అది ఉంది, మీకు తెలియక పోయినా అది ఉంది. హృదయంలో ఉన్న సద్వస్తువును తెలుసుకొన్నవాడికి నిర్వాణసుఖం అందుతుంది అని బుద్ధుడు చెప్పాడు, మోక్ష సుఖం తెలుస్తుంది అని హిందువులు చెప్పారు, స్వర్గరాజ్యానికి అధిపతి అవుతాడు అని క్రీస్తు చెప్పాడు. ఒకోమతం ఒకో పేరుపెట్టింది గాని ఉన్నస్థితి ఒక్కటే. ఆ వస్తువును దర్శించిన వాడికి మనకు తేడా ఏమిటి అంటే ఆ వస్తువు అనుభవంలో ఉన్నవాడికి ఈ సృష్టి అంతాకూడా తన స్వరూపంగా కనబడుతూ ఉంటుంది. బేధ భావన ఉండదు. ఆ వస్తువు ఎవడికైతే అనుభవంలోనికి రాలేదో వాడు ప్రపంచాన్ని అంతా సెపరేట్‌గా చూస్తాడు, భిన్నంగా చూస్తాడు, బేధ భావన వస్తుంది. ఆ బేధభావనలో నుండి అసూయ, భయం, కోపం, కామం అన్నీ వస్తాయి. మానవుడు పతనమవ్వటానికి అన్ని చెడు లక్షణాలు వస్తాయి. ఆ బేధ భావనలో నుండి విడుదల పొందాలంటే నీ హృదయంలో ఉన్న చావులేని వస్తువు గురించి తెలుసుకోవాలి. ఉన్న వస్తువు ఏదో ఒకటి నీహృదయంలో ఉంది.

దాని గురించి అధ్యయనంచేసి, దానిని అర్థం చేసుకొని, దానిని అనుభవంలోనికి తెచ్చుకొంటే నీవు ఒడ్డుకు వచ్చేస్తావు. దానికి నీ తెలివితేటలు ఒక్కటే చాలదు. ఈశ్వరానుగ్రహం అవసరం. ఈశ్వరానుగ్రహం లేకుండా ఈశ్వర సాక్షాత్కారము కలుగదు.

ప్రతీ మనిషికి నేను అనే తలంపు ఉంది. ఆ నేను అనే తలంపు వచ్చాక ఇతర తలంపులు వస్తున్నాయి. నేను అనే తలంపు నీలోపలనుండి వస్తోంది. నేను అనే తలంపు నీలోపల ఎక్కడ ఉదయించి వస్తోందో దానినే హృదయం అని వేదం చెపుతోంది. నీకు తెలిసినా, తెలియక పోయినా నీ దేహం చనిపోయినా చావులేని వస్తువు ఒకటి నీ హృదయంలో ఉంది. ఇప్పడు మనకు నేను అంటే దేహం స్ఫురిస్తోంది, తెలివి స్ఫురిస్తోంది, ఇష్టాలు, అయిష్టాలు స్ఫురిస్తున్నాయి. కాని ఈ తెలివికి, మనస్సుకు, దేహానికి అణుమాత్రం కూడా సంబంధం లేకుండా ఒక చావులేని వస్తువు నీ హృదయంలో ఉంది. అది ఎవరోకాదు. అది నీవై ఉన్నావు. నీవు ఏ వృత్తిలో ఉన్నప్పటికీ నువ్వు ఎవరో నీవు తెలుసుకోవటానికి ప్రయత్నం మానవద్దు. వేదాంతం అంటే చాలామందికి భయం వేస్తుంది. నీ ఆలోచనలో ఉన్న పొరపాట్ల నుండి, నీ అలవాట్లలో నున్న పొరపాట్ల నుండి నువ్వు విడుదల పొందాలి. వాటిలో నుండి ఎలా విడుదల పొందాలి అని వేదాంతం చెపుతుంది. మానవుడియొక్క స్వార్థం, కుయుక్తులు, కుతంత్రాలు,కు చేష్టలు మనస్సుని హృదయాకారంగా ప్రయాణం చేయకుండా పట్టి ఉంచుతాయి. ఈ లోపములనుండి విడుదల చేయటానికి వేదాంతం ప్రయత్నం చేస్తోంది. వేదాంతం అంటే నీకు సంబంధంలేనిది అని అనుకోవద్దు. మనస్సు ఎప్పడైతే లోపాలనుండి, అలవాట్ల నుండి విడుదల పొందిందో తనంతట తానుగా అది హృదయ గుహలో పడిపోతుంది.

పంచదార తియ్యగా ఉంటుందా, చేదుగా ఉంటుందా అని జన్మలతరబడి చర్చ అనవసరం. పంచదార నోట్లో పోసుకుని చూసుకో నీకే తెలుస్తుంది. గురువు అనుగ్రహం నీకళ్ళకు కనబడకపోయినా, నీ చెవులకు వినబడక పోయినా అది నీ అనుభవానికి అందుతుంది, ఆస్పందన హృదయానికి తెలుస్తుంది. నీ హృదయంలో ఉన్న చైతన్యం నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు దానికి సంబంధించిన సుఖం, శాంతి, ఆనందం నీకు సొంతం అవుతాయి. నీహృదయంలో ఉన్న వస్తువును తెలుసుకోవటానికి మూడు మార్గములు చెప్పారు. 1. విచారణా మార్గం. మనం నేను, నేను అంటున్నాము. అది నిజమైన నేను కాదు. అది ఉదయంలేస్తుంది. గాఢ నిద్రలో దాని పుట్టింటికి అది వెళుతోంది. గాఢ నిద్రలో ఈ నేను హృదయగుహలో ఎప్పడైతే పడిపోయిందో అక్కడ ఉన్న సుఖం, శాంతి మనకు తెలుస్తాయి. ఆ సుఖం ఎప్పటి వరకు ఉంటుంది ఉంటే ఉదయం ఈ నేను లేస్తుంది అక్కడ నుండి సైతాను గొడవలు అన్నీ తీసుకొని వస్తుంది. నిజమైన నేను ఒకటిగా ఉంటుంది. అబద్ధమైన నేను అనేకంగా ఉంటుంది. ఒకటిలో నుండి భయం, కామం, దుఃఖం రాదు. ఇద్దరు ఉన్నచోటే అన్నీ వస్తాయి. గాఢ నిత్రలో ఒకటిగా ఉన్నాము కాబట్టి ఆనందంగా ఉన్నాము. మెలుకువ వచ్చాక రెండు, మూడు, నాలుగు అయిపోయాము, అనేకం అయిపోయాము. అబద్ధమైన నేను, దేహగతమైన నేను పోవటం వలన నీవుపోవు, నిజమైన నేను నీకు దొరుకుతుంది. ఇప్పడు మనం అబద్ధమైన నేను ఎటుగంతులు వేయమంటే అటు గంతులు వేస్తున్నాము. మనం స్వతంత్రులము కాదు. నీ హృదయంలో ఉన్న నిజమైన నేను నీకు అనుభవంలోనికి వస్తే నీకు స్వాతంత్ర్యము వస్తుంది.

ఇప్పుడు నీవు ఖండంగా ఉన్నావు. అప్పుడు అఖండముగా ఉండవచ్చు. జననమరణముల నుండి విడుదల పొందవచ్చు. ఈ నేను గురించి విచారణ చేసి దానిని తొలగించుకొన్న నీ హృదయ గుహలో ఉన్న వస్తువు నీకు అందుతుంది. అబద్ధమైన నేను పోవటం వలన నీవు ఎవరో నీకు తెలుస్తుంది. 2. ధ్యానం చేసి కూడా ఆవస్తువును తెలుసుకోవచ్చు. ధ్యానం చేయగా చేయగా నీ మనస్సులో ఉన్న దోషములు నశిస్తాయి. ధ్యానం చేయటం వలన నీ మనస్సులో ఉన్న అల్పత్వం పోయి నీమనస్సుకు తూకం వస్తుంది. అప్పుడు నీమనస్సు హృదయాభిముఖంగా ప్రయాణించి హృదయంలో ఐక్యమవుతుంది. 3. ప్రాణాయామం. భగవంతుడు నీకు రెండు శక్తులు ఇచ్చాడు. ప్రాణం, మనస్సు. మనస్సుతో ఆలోచించుకొంటాము, ప్రాణశక్తి వలన పనులు చేస్తాము. ఈ రెండింటికి లోపల సోర్సు ఒక్కటే ప్రాణాన్ని నిరోధించటం వలన మనస్సు నిగ్రహించబడుతుంది. మనస్సుకు అంతర్ దృష్టి కలుగుతుంది. అంతర్ దృష్టి కలిగిన మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణించి హృదయంలో ఐక్యమవుతుంది. నీకు నచ్చినమార్గంలో ప్రయాణం చేసి నీ హృదయంలో ఉన్న వస్తువును తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి.

నీ హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది. అది ఉండటంవలననే అది తెలియబడుతుంది కాని అది ఉందని చెప్పటానికి ఋజువులు, సాక్ష్యాలు అక్కరలేదు. ఆ వస్తువుతోటి సాంగత్యం నీకు కుదిరితే బాహ్యంగా ఉన్న యోగులతోటి, మహర్షులతోటి సాంగత్యం నీకు అవసరంలేదు. అది అందరికీ సాధ్యంకాదు. ఈశ్వరానుగ్రం ఉన్నవారికి, బాగా పుణ్యబలం ఉన్నవారికి, పూర్వజన్మలలో సత్కర్మ చేసినవారికి లోపల ఉన్న సత్యవస్తువుతో అనుబంధం కుదురుతుంది. హృదయంలో ఉన్న సత్యవస్తువుతో కలిసి ఉండటం అందరికీ సాధ్యంకాదు. ఆసత్యవస్తువు ఎవరికయితే అనుభవంలో ఉందో వారితో సహవాసం చేస్తే బ్రహ్మానుభవం పొందటానికి నీకు ఏ అలవాట్లు అయితే అడ్డువస్తున్నాయో అవి పల్చబడతాయి. వారి వైబ్రేషన్స్ నీ మీద పనిచేస్తాయి. నీకు తెలియకుండానే చెడు అలవాట్ల వేగం తగ్గుతుంది. మహాత్ముల సన్నిధిలో అవి ఎండిపోయి, రాలిపోతాయి. ఏ తలంపులు అయితే నిన్ను బాధిస్తున్నాయో అవి మహాత్ముల సహవాసం వలన నెమ్మదిగా తగ్గుతాయి. నీకు తెలియకుండా, నీ ప్రయత్నం లేకుండా మహాత్ముల సహవాసంవలన ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతావు. నీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా వారి ప్రభావం నీ మీద పనిచేస్తుంది. నీవు కూడా అంతటివాడవు అయిపోతావు. హోలి కంపెనీకి ఇంత ప్రభావం ఉంది.

భౌతికంగా అత్యంత సమీపంగా ఉండి మానసికంగా దూరంగా ఉండటం కంటే భౌతికంగా దూరంగా ఉన్నా మానసికంగా దగ్గరగా ఉండటం మంచిది. గురువుతో మానసిక అనుబంధం పెట్టుకోండి. గురువు అంటే దేహంకాదు. గురువు, చైతన్యం, ఈశ్వరుడు అంటే ఏమిటి అనే అవగాహన నీకు ఉంటే నీవు ఏ గ్రామంలో ఉన్నా ఎక్కడ ఉన్నా ఎలా ఉన్నా నీవు సంతోషంగా ఉండవచ్చు. గురువు అనుగ్రహంలో పడినవాడు తరించబడతాడు గాని పతనం అవ్వటానికి అవకాశంలేదు. వాడిలో ఉన్న బలహీనతలు గురువుకు తెలుస్తూ ఉంటాయి. ఆ బలహీనతలనుండి బయటకు లాగివాడిని పవిత్రున్ని చేసి వాడికి మోక్షస్థితిని ఇచ్చేవరకూ గురువు వాడిని వెంటాడుతూనే ఉంటాడు. వాడు నిజమైన గురువు. హోలికంపెనీలో ఎంత శక్తి ఉంటుందో హోలీ స్థలములలో కూడా అంతశక్తి

ఉంటుంది. ఎందుచేతనంటే అక్కడ ఎందరో మహాత్ములు తపస్సులు చేసి ఉంటారు. గురువును కేవలము దేహానికి పరిమితం చేయవద్దు. గురువు శరీరం పడిపోతే మనకు అనుగ్రహంరాదు అని అనుకోవద్దు. అనుగ్రహించేది దేహంకాదు. అనుగ్రహించేది ఒక్కటే అది ఎప్పడు ఉంటుంది. అది నిన్ను అనుగ్రహిస్తుంది. గురువు యొక్క దేహనికి కంఫర్టు చూసినప్పటికీ ఆ గురువు నిన్ను అనుగ్రహించక పోయినా ఈశ్వరుడు నిన్ను అనుగ్రహిస్తాడు.

నీకు వచ్చే కష్టాలు, నష్టాలు, నీవు అనుభవించే భోగాలు అన్నీ అసత్యం అని నేను చెప్పటంలేదు. నీ మనస్సు ఎంత నిజమో అవి అన్నీ కూడా అంతే నిజం అంటున్నారు. పునర్జన్మకు కారణములు అన్నీ నీ మనస్సులోనే ఉన్నాయి. మనస్సు అనేది నీ సొంత సమస్య. నీ సొంత సమస్యను నీవే పరిష్కారం చేసుకోవాలి. ఈమనస్సు అనే సమస్యను పరిష్కారం చేసుకోకపోతే నీకు సుఖంలేదు, శాంతిలేదు, ఆనందంలేదు, స్వేచ్ఛలేదు. మీరందరు ఇక్కడ కూర్చొన్నారు అనుకోండి. గంటలతరబడి ఉపన్యాసం చెపుతాను అనుకోండి. దానివలన మీకు మారుమనస్సురాలేదు అనుకోండి ఆ ఉపన్యాసముల వలన ప్రయోజనంలేదు. ఒక మహాగురువు, ఒక మహాజ్ఞాని సమక్షంలో కూర్చోన్నారు అనుకోండి. వాడు మాటలు ఏమీ చెప్పలేదు అనుకోండి. కాని వాడి అనుగ్రహం వలన మీకు మారు మనస్సు తీసుకొని వచ్చాడు అనుకోండి. ఏ విషయములయితే నీ మనస్సును బాధపెడుతున్నాయో వాటిలో నుండి మీ మనస్సును విడుదల చేసాడు అనుకోండి. అది నిజమైన టీచింగ్, ఏకారణంవలన మీకు దుఃఖం వస్తోందో ఆకారణములను ఎవడైతే తీసివేస్తున్నాడో వాడే నిజమైన గురువు. గురువు మాటలు చెప్పనక్కరలేదు, చూపు అక్కరలేదు. గురువు ఉండటం వలననే మీకు తెలియకుండా మీ మనస్సు పవిత్రం అవుతుంది. మీరుశుద్ధులు అవుతారు. శుద్ధులు కానివారికి సిద్ధిరాదు. గురువు మౌనంగా ఉండటం వలన మనకు ఏమీ ఉపయోగపడటం లేదు అని అనుకోవద్దు. మౌనం మాటకంటే అత్యంత శక్తి వంతమైనది. అన్ని దీక్షలు మౌనం నుండే వస్తాయి. మౌనం అన్నింటికంటే ప్రధానమైనది.

మహిమలు కూడా మనస్సుకు సంబంధించినవే. మనస్సు లేనివాడికి మహిమలు ఏమిటి ?గాఢ నిద్రలో ఎవరికి మహిమల గొడవలేదు. జాగ్రదావస్థలోనే మహిమలు వస్తాయి. మనస్సు ఉన్నప్పడే మహిమల గొడవ, మనస్సు లేనప్పడు మహిమల గొడవలేదు. నీ మనస్సు ఎంత నిజమో ఈ మహిమలు కూడా అంతే నిజం. పరమసత్యానికి ఈ మహిమలకు ఎట్టి సంబంధంలేదు. నీశరీరం ఎక్కడ ఉన్నది అనేది ప్రధానంకాదు. నీక్షేమం కోరేవాడు రష్యాలో ఉన్నావాడు నీ పొరుగువాడితో సమానమే. భగవంతునితో మానసిక అనుబంధం ముఖ్యం. భగవంతుని నీమనస్సుతో స్మరించగా, స్మరించగా అది పవిత్రం అవుతుంది. నీ మనస్సుకు ఎప్పడైతే పవిత్రత వచ్చిందో, ఏకాగ్రత వచ్చిందో బ్రహ్మం తనంతట తానుగా వచ్చి నిన్ను వరిస్తుంది. నువ్వు కంగారు పడవద్దు. అసహనంగా ఉండవద్దు. భౌతికంగా గాని, ఆధ్యాత్మికంగా గాని అభివృద్ధిలోనికి రావాలంటే సహనం అవసరం. సహనంలేకుండా ఏది సాధించలేము. కేవలము నీ తెలివితేటల వలన అన్నీ సాధించగలను అని అనుకోవద్దు. నీ తెలివితేటల వలన నీవు ఉద్ధరించబడవు. నీవు ప్రయత్నం చేయాలి. కాలం కలిసి రావాలి ఈశ్వరానుగ్రహం కలగాలి. ఇవి మూడు ఉంటేనే నీవు ఒడ్డకు వస్తావు.